## బాధిత కుటుంబానికి పరామర్శ



బోథ్: కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, మే 23: ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని సాకేర గ్రామానికి చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ సవైరామ్ కుమారుడు ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నిర్మల్ చైన్‌గేట్, మే 23 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ అలేఖ్య అన్నారు. నిర్మల్‌లోని శాస్త్రినగర్‌లో యాక్సెంచర్, ఈడీఐఐ ఆధ్వర్యంలో అగర్బత్తి దూప్‌స్టిక్ తయారీ శిక్షణ తీసుకునే అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు పలు శిక్షణలు కల్పిస్తూ వారికి స్వయం ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ సవిత, ఈడీఐఐ కోఆర్డినేటర్ రవి, డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్టులు జ్యోతి, మౌనిక, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు శైలజ, మహిళలు పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, మే 23 : నిర్మల్‌లోని సన్‌షైన్ దవాఖాన అపార్టు మెంట్ వద్ద ఓ వ్యక్తికి మలేరియా రావడంతో వైద్య, మున్సిపల్ సిబ్బంది పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ ద్రావణంతో పిచికారీ చేశారు. వ్యాధిగ్రస్తుని కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం దేవీదాస్, శానిటరీ జవాన్ బీ సంతోష్, వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటస్వామి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ మహేందర్, ఆశ కార్యకర్త రాధ పాల్గొన్నారు.

## పత్తి సాగుపై అవగాహన

బాసర, మే 23 : నిర్మల్ జిల్లా బాసరలో భారతీయ కిషాన్ సంఘ్, జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ కార్యదర్శులు దాదాలాడ్ పత్తి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి సాగులో 8 క్వింటాళ్లు పండించే భూములను 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేలా తీసుకోవాల్సిన మెలుకువలను తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నిర్మల్ అర్బన్, మే 23 : మంచిర్యాలలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల,బాలికల బాక్సింగ్ పోటీలకు నిర్మల్ నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. బాలికల విభాగంలో నికిత, అక్షిత, కీర్తన, అభినయన, శ్రావణి, బాలుర విబాంగలో దీక్షిత్, కృషి రెడ్డి, శౌర్యన్ రెడ్డి, అభిలాష్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో స్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్, శ్రీధర్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

బోథ్, మే 23: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని రెండ్లపల్లి గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు తుల శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట నాయకులు సురేందర్, బొడ్డు శ్రీనివాస్, అల్లకొండ ప్రశాంత్, గంగారాం, మనోహర్, బాపురావ్ ఉన్నారు.

## రేషన్ బియ్యం వినియోగదారులకు అందించాలి

జైనథ్, మే 23 : వినియోగదారులకు సకాలంలో రేషన్ బియ్యం అందించాలని సాత్నాల తహసీల్దార్ మడావి విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా సాత్నాలలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపులో సరుకును ఏ రోజుకు ఆ రోజు బోర్డుపై ఉంచాలన్నారు. దీంతో పాటు స్టాక్ రికార్డులు రాసి పెట్టాలని సూచించారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## అవగాహనతోనే టీబీ దూరం

ఉట్నూర్, మే 23: టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా రూపు మాపవచ్చని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో వైద్యశాఖ సిబ్బందితో కలిసి టీబీ ముక్త్ భారత్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కంట్రోలర్ అధికారి డాక్టర్ సుమలత, జిల్లా కోఆర్డీనేటర్ జాదవ్ సుదర్శన్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్, అంబారావు, ల్యాబ్ టెక్నీషియన్ వేణు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య బోధించాలి

ఉట్నూర్ రూరల్, మే 23: విద్యార్థులకు మెరుగైన విద్య బోధించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని లక్కారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను పరిశీలించారు. అనంతరం ఇటీవల వెలుబడిన సివిల్ ఫలితాల్లో 76వ ర్యాంకు సాధించిన సాయిచైతన్య తల్లి ఉపాధ్యాయురాలిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆశన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేర్వేరు చోట్ల విద్యుత్ షాక్‌తో పశువులు మృతి

భైంసాటౌన్, మే 23 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కుంసర గ్రామంలో భూమన్నకు చెందిన ఎద్దు శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామ శివారులోని విద్యుత్ నియంత్రిక వద్ద స్తంభానికి ఏర్పాటు చేసిన ఎర్తింగ్ తీగకు ఎద్దు తగలడంతో మృతి చెందింది. ఎద్దు విలువ రూ. లక్ష వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

నర్సాపూర్(జీ), మే 23 : నర్సాపూర్(జీ) మండలం గొల్లమాడ గ్రామంలోని మస్కిరి లక్ష్మణ్‌కు చెందిన మేక కరెంట్ షాక్‌తో మృతి చెందింది. తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో మేతకు వెళ్లిన మేక ట్రాన్స్‌పార్మర్‌కు తగలడంతో మృతి చెందింది. మేక విలువ రూ. 20 వేలు ఉంటుందని నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

బోథ్, మే 23: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కౌఠ(బీ) గ్రామంలో పాడిగేల భీముడు అనే రైతుకు చెందిన గేదె మేత కోసం వెళ్లగా కింద పడి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేల వరకు ఉంటుంది. విద్యుత్ శాఖాధికారులు చొరవ తీసుకొని పరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు.

## వడ్‌గాంలో శాస్త్రవేత్తల అవగాహన

తాంసి(భీంపూర్), మే 23: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని వడ్‌గాంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు రాజేందర్ రెడ్డి, రఘువీర్, అనిల్, ఏవో శ్రీనివాస్ రెడ్డి, ఏఈవో వెంకటేశ్ రైతులకు అవగాహన కల్పించారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

భైంసా, మే 23 : మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ రాజేశ్ అన్నారు. శుక్రవారం భైంసాలోని సిద్దార్థ నగర్‌లో అమృత్ 2.0 హుమెన్స్ ఫర్ ట్రీస్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మొక్కలను నాటారు. మేనేజర్ గౌరీశ్, మెప్మా టీఎంసీ సావిత్రి, సీవోలు వెంకటేశ్, ముజమ్మిల్, ఆర్పీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వానకాలం పంటకు పత్తి విత్తనాలు సిద్ధం

- ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేసిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



రికార్డులు పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మే 23 : వానకాలం సీజన్‌కు సంబంధించి పత్తి విత్తనాలు, తదితర వ్యవసాయ ఇన్‌పుట్స్ రైతులకు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లతో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసి దుకాణాలపై నిఘా ఉంచామని తెలిపారు. రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు తీసుకోవాలని, ప్యాకెట్లను పంట కాలం ముగిసే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ కమిటీ వివరాలు ఫ్లెక్సీ రూపంలో ప్రదర్శించాలని తెలిపారు. నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు శాఖల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ టీంలు పని చేస్తాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి, ఇన్‌చార్జి ఏడీఏ శివకుమార్, ఆదిలాబాద్ అర్బన్ ఏవో వివేక్, సిబ్బంది పాషా ఉన్నారు.

### నైపుణ్య శిక్షణలు అభినందనీయం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీ పరీక్షల శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని రణదివేనగర్‌లో ట్వీంటి ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఎనిమిది నుంచి 12వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం పోటీ పరీక్షలకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం నాణ్యమైన శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ట్వీటి ఫస్ట్ సెంచరీ అకాడమీ సీఈవో విశ్వనాథ్, భవానిశంకర్, కృష్ణ ప్రదీప్ పాల్గొన్నారు.

### టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

మహిళలకు టైలరింగ్ వంటి వృత్తిపరమైన నైపుణ్యాలను అందించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థికంగా ఎదుగుతారని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్‌లోని టీటీడీసీలో ట్రైల్ బ్లేజర్స్ ఇండియా ఫౌండేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) సహకారంతో మహిళలకు నిర్వహించిన టైలరింగ్ తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజైన్, కొలత, కటింగ్, కుట్టుపని వంటి శిక్షణలతో మహిళలు తమ సొంతంగా దుస్తులు, బ్యాగులు, ఫైల్స్ వంటి ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి ఎదుగుతారన్నారు. ప్రతి ఏడాది 60 మంది మహిళలకు టైలరింగ్ శిక్షణ కల్పిస్తారని తెలిపారు. అనంతరం నిజామాబాద్‌లోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ రీజినల్ మేనేజర్ ఎస్ఎస్. శ్రీనివాస్, హెచ్‌పీసీఎల్ సీఎస్ఆర్ కార్యకలాపాల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రైల్ బ్లేజర్స్ ఇండియా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డీఆర్ రాగ్లాండ్, డీఆర్డీఏ రాథోడ్ రవీందర్, హెచ్‌పీసీఎల్ మహిళా సమైక్య సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి




మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మే 23 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టర్ సమావేశమందిరంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై విశ్వసనీయత పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు గాడిచర్ల రఘునాథ్

ఎదులాపురం, మే 23 : బోధన ప్రమాణాల మెరుగు, నైపుణ్యాభివృద్ధికి ఉపాధ్యాయ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని ఎస్సీఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు గాడిచర్ల రఘునాథ్ అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లోని గెజిటెడ్ నంబర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని బోధన మెరుపర్చుకోవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు విశ్వనీయతను పెంచేలా బోధన చేయాలని సూచించారు. విద్యార్థి కేంద్రీకృత విధానంలో పాఠాలు బోధించి విద్యార్థుల్లో నైపుణ్యత పెంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, డీఆర్పీలు సవితాదేవి, రజిత, పోచన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

# బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించాలి

ఎదులాపురం, మే 23 : బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం బక్రీద్ పండుగ, రోడ్ సేఫ్టీ, డ్రగ్స్‌పై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ముస్లిం మత పెద్దలు, మున్సిపల్, పంచాయతీ, పోలీసు అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ వచ్చే నెల 7న బక్రీద్ సందర్భంగా మసీదు, ప్రతి ఈద్గా దగ్గర పారిశుధ్య పనులు చేపట్టాలని, నీటి సదుపాయం కల్పించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వెటర్నరీ అధికారులు ధ్రువీకరించిన జంతువులను మాత్రమే వినియోగించాలని, వాహనాల్లో తరలించే జంతువులకు అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

### జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులతో సమావేశం

సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ ఆదేశాలు – 1988 మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 215 ప్రకారం రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రతి జిల్లాకూ జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులకు సంబంధించి సమావేశం నిర్వహించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆర్టీవో శివపల్లి, ఎన్‌హెచ్ఏఐ రావుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా చర్యలు పాటించాలన్నారు. వాహనాల కండిషన్ ప్రతి ఏడాదీ పరిశీలించి ఫిట్‌నెస్ రెన్యువల్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, డీఎస్పీ జీవన్ రెడ్డి, ఆర్డీవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి కేసుల్లో 90 మంది అరెస్ట్

- 26 కిలోల గంజాయి స్వాధీనం
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



భీంపూర్ మండలం తాంసి(కే) గ్రామంలో గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎదులాపురం, మే 23 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గంజాయి కేసులపై పోలీసు విభాగం గట్టి చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు నమోదైన 50 కేసుల్లో 90 మందిని అరెస్టు చేసి, 26 కిలోల గంజాయితో పాటు 230 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం భీంపూర్ మండలం తాంసి (కే) గ్రామంలోని వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న మంచికంటి అశోక్, ఓంకార్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 30 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుని, భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి నియంత్రణకు పోలీసు, షీటీం సిబ్బంది, గ్రామీణ పోలీసు మీ కోసం కార్యక్రమాల్లో భాగంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గంజాయి సేవించిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక కిట్లు ఉపయోగించి పరిశీలన కొనసాగుతుందన్నారు. గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, దీనిపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాల్సిన వారు వాట్సాప్ ద్వారా 8712659973 నంబర్‌కు పంపవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని స్పష్టం చేశారు.

## శిక్షణ కేంద్రం సందర్శన


లోకేశ్వరం, మే 23 : లోకేశ్వరం, మన్మథ్ జడ్పీఎస్ఎస్ పాఠశాలలో కొనసాగుతున్న మండల స్థాయి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా రిసోర్స్ పర్సన్ మాదరి ఎల్లన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తిరిగి రిసోర్స్ పర్సన్‌గా రావడం సంతోషంగా ఉందని అన్నారు. మౌలిక భాష, గణిత సామర్థ్యాలలో భాగంగా (ఎఫ్ఎల్ఎన్)ను పరిశీలించామన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంలోని సామర్థ్యాలు, సోపనాల ప్రకారం బోధన చేయాలని అన్నారు. కోర్సు లక్ష్యాలను ప్రతి ఒక్కరూ గుర్తించి పాఠశాల స్థాయిలో వినియోగించినప్పుడే దానికి సార్థకతని తెలియజేవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు చిన్నయ్య, ప్రవీణ్, శ్రీనివాస్, సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల, మే 23 : కల్లూరు, కుంటాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా రిసోర్స్ పర్సన్ మాదరి ఎల్లన్న సందర్శించారు. ఉపాధ్యాయులకు కోర్సు లక్ష్యాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీలు శ్రీనివాస్, సుధాకర్, వివేకానంద, ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

భైంసా, మే, 23 : ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు అని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలోని వాసవి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఉపాధ్యాయుల ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, ఎంఈవో సుభాష్, రిసోర్స్‌పర్సన్లు ఎల్లన్న, కృష్ణ, రాజేశ్వర్, హన్మాండ్లు, గణేశ్, విఠల్‌రెడ్డి, నరేశ్, బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిగ్రీ పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాకతీయ యూనివర్సిటీ అధికారులు

కుంటాల, మే 23 : నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరులోని వాసవి డిగ్రీ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలోజరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను శుక్రవారం కాకతీయ పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ డా. రాజేందర్ కట్ల, అడిషనల్ కంట్రోలర్ ప్రొఫెసర్ డా. తిరుమల దేవి, ప్రొఫెసర్ డా. వెంకయ్య, పర్యవేక్షకుడు అసోసియేట్ ప్రొఫెసర్ డా. మధు పర్యవేక్షించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులకు వేసవి నేపథ్యంలో సరైన వసతులు కల్పించాలని ప్రొఫెసర్ డాక్టర్ కట్ల రాజేందర్ ఆదేశించారు. నిర్మల్ జిల్లాలో వాసవి డిగ్రీ కళాశాలతో పాటు నిర్మల్, కుభీర్, సారంగాపూర్, కుంటాల, లోకేశ్వరంలోని పరీక్షా కేంద్రాలు కూడా తనిఖీ చేశారు. ఆయన వెంట వాసవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస, కరస్పాండెంట్ సాయిలు ఉన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

దిలావర్‌పూర్, మే 23 : అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులతో ఆయన మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అలాగే గుండంపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ తోటల గెలలు కట్ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఏజాజ్ హమ్మద్‌ఖాన్, ఎంపీడీవో అరుణరాణి, సహకార సంఘం సీఈవోలు అశోక్, సుకుమార్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు వీరేశ్‌కుమార్, ముత్యంరెడ్డి, తక్కల రమణరెడ్డి, శైలేశ్వర్ నాయకులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## చనిపోయిన ఏఎన్ఎంకు న్యాయం చేయాలి



ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉట్నూర్, మే 23 : ఇటీవల చనిపోయిన ఏఎన్ఎంకు న్యాయం చేయాలని మంచిర్యాల జిల్లా సీఐటీయూ కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఐటీడీఏలో పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమాల్లో, వసతి గృహాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. 24 గంటలు ఆశ్రమాల్లో పని చేస్తూ విద్యార్థులకు ఎటువంటి ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమన్నారు. ఇక్కడ నాయకులు ఆశన్న, ఏఎన్ఎంలు కామేశ్వరి, జంగుబాయి, నర్మద, అశ్విని, రంభ, చిత్రకళ ఉన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులు



అవార్డులు తీసుకున్న ఆర్టీసీ సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్, మే 23: నిర్మల్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న 20 మంది ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రగతి చక్ర అవార్డులు ప్రదానం చేశారు. శుక్రవారం నిర్మల్ డిపోలో జరిగిన కార్యక్రమంలో వారికి డీఎం పండరి శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

దస్తురాబాద్, మే 23 : ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని దస్తురాబాద్ క్లస్టర్ ఏఈవో జాడి తిరుపతి అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని మున్యాలతండాలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం



పంట చేనులో వంగిన విద్యుత్ స్తంభం

తాంసి, మే 23: ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి పొన్నారి గ్రామ సమీపంలోని ఓ పంట చేనులో మట్టి కోతకు గురై 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభం వంగిపోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో మండల ప్రజలు విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు లో–వోల్టేజీ కారణంగా పలు గ్రామాల్లో కూలర్లు, ఫ్యాన్లు చెడిపోయినట్లు బాధితులు తెలిపారు.

## బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాలకు ప్రాధాన్యత

గుడిహత్నూర్, మే 23 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరయ్యాయి. బోథ్ గ్రామస్తుల పిలుపుమేరకు శుక్రవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్ భూమి పూజ చేసే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలో ప్రతి గ్రామంలో నున్నా గుడికి ప్రాధాన్యత నిచ్చి నిధులు మంజూరు చేసి ఘనత దక్కిందన్నారు.

## భీంపూర్ మండలంలో వర్షం

తాంసి(భీంపూర్), మే 23: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని అంతర్గాం, అర్లి(టీ), కరంజి(టీ), గుబిడి శివారుల్లో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అసలే అధ్వానంగా ఉన్న కరంజి(టీ) గుబిడి రోడ్లు బురదమయం అయ్యాయి. చేన్లలో జొన్న పంటకు నష్టం వాటిల్లింది.

## సైనిక్ స్కూల్‌కు అర్హత సాధించిన విద్యార్థులు

ఇచ్చోడ, మే 23: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని సన్‌షైన్ పాఠశాల విద్యార్థులు అంబేద్కర్, గౌతం కృష్ణ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారు. శుక్రవారం పాఠశాల యజమాన్యం విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, యాజమాన్య బృందం గణేశ్, రాకేశ్, సంజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శార్విన్‌రెడ్డిని సన్మానిస్తున్న సంస్కార్ పాఠశాల కరస్పాండెంట్ అయ్యన్నగారి శ్రీధర్

నిర్మల్ అర్బన్. మే 23 : నిర్మల్‌లోని సంస్కార్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శాలిగిరి శార్విన్‌రెడ్డికి సైని ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయి 213, రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అయ్యన్నగారి శ్రీధర్, ప్రిన్సిపాల్ రచన విద్యార్థిని అభినందించి శాలువాతో సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## జొన్నల కొనుగోలును త్వరగా పూర్తి చేయాలి

జైనథ్, మే 23 : ఉమ్మడి మండలంలోని మేడిగూడ, జైనథ్, పిప్పర్‌వాడలో చేపడుతున్న జొన్నల కొనుగోలును త్వరగా పూర్తి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్‌లోని మార్కెట్ యార్డులో చేపడుతున్న జొన్నల కొనుగోలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పంటను అమ్మకానికి తీసుకువచ్చిన జొన్న రైతులు ఐదు, ఆరు రోజులు వేచి చూడడం బాధకరమన్నారు. అకాల వర్షంతో జొన్న పంట తడస్తూ ఉన్నందున కేంద్రాల్లో రాత్రిబవళ్లు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి

సోన్, మే 23 : నిర్మల్ మండలం ముజ్గి గ్రామానికి చెందిన పెద్దకొండ గంగవ్వ(72) అనే వృద్ధురాలు శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..గంగవ్వ విద్యుత్ స్తంభం నుంచి వైర్ ద్వారా విద్యుత్ సరఫరా కానున్న ఇనుపరాడును పట్టుకోగా అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పలువురి బైండోవర్

ఖానాపూర్ టౌన్, మే 23 : ఎక్సైజ్ శాఖ నిబంధనలు ఉల్లఘించి వివిధ కేసుల్లో పట్టుబడిన ఆరుగురిని శుక్రవారం తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ అధికారులు బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి గుడుంబా అమ్మిన, తయారు చేసిన జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

## యువకుడు అదృశ్యం

ఎదులాపురం, మే 23 : ఆదిలాబాద్‌లోని ఖానాపూర్‌కు చెందిన అబ్బిన్వార్ సాయి రామ్ (26) అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఉదయం ఇంటి నుంచి సాయి రామ్ వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. గతంలో ఇలాగే ఇంటి నుంచి వెళ్లిపోయి పది రోజుల తర్వాత మళ్లీ తిరిగి వచ్చాడు. ఈసారి ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఏజెన్సీలోని నాన్‌ట్రైబ్స్‌ను ఇబ్బంది పెడుతున్న ఇద్దరిపై కేసు

ఉట్నూర్, మే 23: ఏజెన్సీ పరిధిలోని ఇంద్రవెల్లి నాన్‌ట్రైబల్స్‌ను ఇబ్బందులకు గురి చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న ఇద్దరి గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ సీఐ మొగిళి తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో నివసిస్తున్న నాన్‌ట్రైబల్స్ సాధారణంగా బాండ్ పేపర్‌పై క్రయ, విక్రయాలు నిర్వహిస్తూ జీవిస్తున్నారన్నారు. అయితే ఈ లొసుగును చూపిస్తూ నాన్‌ట్రైబల్స్‌కు ఐటీడీఏ కార్యాలయం నుంచి నోటీసులు ఇప్పిస్తూ వాటి ఉప సంహరణకు లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ ఇబ్బందులు చేస్తున్నారన్నారు. ఇప్పటికే చంపత్‌రావు నుంచి రెండు లక్షలు, ఇంద్రవెల్లి పబ్లిక్ స్కూల్ యజమాని నుంచి రెండు లక్షల చొప్పున నాలుగు లక్షలు తీసుకున్నారన్నారు. అంతటితో ఆగకుండా మండల కేంద్రంలో నివసిస్తున్న గ్రామస్తులు, వ్యాపారులైన నాన్ ట్రైబల్స్ అందరూ కలిసి తమకు 20 లక్షలు ఇవ్వాలని లేదంటే అందరిపై కేసులు నమోదు చేస్తామని ప్రతి రోజూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. వీరికి విసిగిపోయిన అడవు చంపత్‌రావు బాధితుడు ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గుడిహత్నూర్‌కు చెందిన బిపిన్ కుమార్, ఆదిలాబాద్‌కు చెందిన మెస్రం ఆనంద్‌రావుపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.